

ఇంటి ఆవరణలోని నిల్వ నీటిలో దోమ లార్వాలను పరిశీలిస్తున్న మలేరియా సిబ్బంది



ఇంటి వద్ద డ్రమ్ములో దోమ లార్వాలను గుర్తిస్తున్న ఆశ వర్కర్లు



ఇంటింటి సర్వేలో అనుమానితుల నుంచి రక్త నమూనాలు తీసుకుంటున్న బయాలజిస్టులు

వ్యాధుల కాలం.. రక్షణ ముఖ్యం

- జాగ్రత్తలతోనే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల కట్టడి
- వార్డుల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- ఇంటింటి ప్రచారం చేపడుతున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: వర్షా కాలం ప్రారంభం కావటంతో ప్రజల్లో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా వార్డుల్లో ప్రజలకు అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. మూడు చెత్త బుట్టల విధానాన్ని పాటించాలని నియోజకవర్గంలోని జీవీఎంసీ 32, 33, 34 వార్డుల పరిధిలో భీమ్‌నగర్, కొబ్బరితోట, భానోజీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని, ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఉంచరాదని, నీటిని నిల్వ చేయరాదని హెచ్చరిస్తున్నారు. అందరికీ రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చర్యలు చేపడుతున్నారు. వ్యాధి నివారణ తర్వాత అందుకు తగిన విధంగా మందులు అందజేస్తున్నారు.

విస్తృత అవగాహన..

జులై 1 నుండి 31 వరకు జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా జీవీఎంసీ మలేరియా విభాగం, జిల్లా మలేరియా విభాగం సంయుక్తంగా ప్రజలలో డెంగ్యూ నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు సచివాలయాల పరిధిలో గల వార్డు సచివాలయ కార్యదర్శులు డెంగ్యూ నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ ఇంటి చుట్టుపక్కల ఉండే మంచి నీటి నిల్వలున్న చోట గుడ్లు పెట్టి లార్వా, ప్యూపాగా మారి చివరకు దోమగా వృద్ధి చెంది మనిషిని పగటిపూట కుట్టి డెంగ్యూ వ్యాధిని కలుగజేస్తుంది. వర్షా కాలంలో డెంగ్యూ దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయని, అందుకు ప్రజలు డెంగ్యూ నివారణపై అవగాహన కలిగి ఉండాలని మలేరియా, జీవీఎంసీ సిబ్బంది తెలియజేస్తున్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, ఇంటిలో ప్రతి మూడు రోజులకు ఒకసారి మంచి నీటిని మార్చాలని, ఇంటిపైన వాటర్ ట్యాంకులకు పూర్తిగా మూతలు బిగించి ఉంచాలని, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో ఉన్న నీటి నిల్వలు, పూల కుండీలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలు ఉపయోగించాలని, కాళ్లు, చేతులను పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, ఇంటి కిటికీలకు తెరలు అమర్చాలని వివరిస్తున్నారు.

ఇంటింటా ప్రచారం..

జీవీఎంసీ ప్రజారోగ్య విభాగంలోని మలేరియా సిబ్బంది డోర్ టు డోర్ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశీలించి ప్రజలకు డెంగ్యూ వ్యాధి నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులను, బయాలజిస్టును జీవీఎంసీ కమిషనర్ ఆదేశించిన మేరకు ఇంటింటికీ వెళ్లి అనుమానితుల రక్త నమూనాలు తీసుకుని పరీక్షలు నిర్వహిస్తున్నారు.



కనకలదిబ్బలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సిబ్బంది

దోమ తెరలు వాడాలి..



వాతావరణ మార్పుల వల్ల వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయి. దోమ గుడ్లు పెట్టే సమయంలో దాని కాటుకు గురయ్యే అవకాశం ఉంటుంది. దోమ తెరలు వినియోగిస్తే మంచిది. ఆకస్మిక అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, తీవ్రమైన కండరాల నొప్పి, అలసట, వికారం, వాంతులు అతిసార, చర్మంపై దద్దుర్ల వంటి లక్షణాలు కనపడితే డాక్టర్‌ని సంప్రదించాలి. తగిన పరీక్షలు చేయించుకుని మందులు వాడాలి. ముఖ్యంగా ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ నిఖిల్ రాజ్, వైద్యాధికారి, భీమ్‌నగర్ ప్రాథమిక వైద్యశాల

డెంగ్యూ జ్వరం లక్షణాలు

డెంగ్యూ ప్రబలితే ఆకస్మిక అధిక జ్వరం (105 డిగ్రీలు), తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, తీవ్రమైన కండరాల నొప్పి, అలసట, వికారం, వాంతులు అవుతాయి. అతిసార, చర్మంపై దద్దుర్లు, ఇది జ్వరం వచ్చిన రెండు నుంచి ఐదు రోజుల తర్వాత కనిపిస్తుంది. తేలికపాటి రక్త స్రావం (ముక్కు నుండి, చిగుళ్ల నుండి రక్తస్రావం లేదా సులభంగా గాయాల వంటివి) కొన్నిసార్లు, డెంగ్యూ జ్వరం లక్షణాలు తేలికపాటివి, ఫ్లూ లేదా ఇతర వైరల్ జ్వర లక్షణాలు కావచ్చు. డెంగ్యూ హెమరేజిక్ జ్వరం, అధిక జ్వరం, రక్త నాళాలు దెబ్బతినడం, ముక్కు, చిగుళ్ల నుండి రక్తస్రావం, కాలేయం పెద్దదిగా మారడం, రక్త ప్రసరణ వ్యవస్థ వైఫల్యం వంటి అరుదైన సమస్యలు ఎదురవుతాయి. భారీ రక్తస్రావంతో మరణంగా మారవచ్చు. దీన్నే డెంగ్యూ షాక్ సింధ్రోమ్ అంటారు. వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సిబ్బందిహెచ్చరిస్తున్నారు.

క్లుప్తంగా

కుసుమ హరనాథుల లీలా కల్యాణం



లీలా కల్యాణంలో కుసుమ హరనాథులు

డాబాగార్డెన్స్: రాజీవ్‌నగర్‌లో కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నామ సప్తాహంలో భాగంగా లోక కల్యాణార్థం విశ్వశాంతిని కాంక్షిస్తూ ఆదివారం కుసుమ హరనాథుల లీలా కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, వేదాశీర్వచనం అందజేశారు. విశాఖ నుంచే కాక వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. షోడశాక్షరి నామంతో నిర్విరామంగా నిర్వహిస్తున్న నామ సప్తాహ మహోత్సవంలో ఆశ్రమ కమిటీ ప్రతినిధులు బీవీ బాబాజీ, ఆర్వీఎస్ రమేష్, ఎస్.అన్నాజీరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కె.మంగరాజు, ఎం.జగన్నాథరావు, శివ, సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు

అల్లిపురం: రౌడీ షీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు హెచ్చరించారు. డీసీపీ 1 అజిత వేజెండ్ల పర్యవేక్షణలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి నేతృత్వంలో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచి రౌడీ షీట్ ఉన్న వారు ఎలాంటి కేసుల్లో కూడా తల దూర్చరాదని సూచించారు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాల్లో పాలుపంచుకుంటే చట్టంలో ఉన్న యాక్ట్‌ల ప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడపాల్సి వస్తుందని సీఐ ఎర్రంనాయుడు హెచ్చరించారు. నగర బహిష్కరణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, రౌడీషీటర్లకు ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కాంతారావు, సింహాచలం పాల్గొన్నారు.

గురుపూజోత్సవానికి ఏర్పాట్లు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయిబాబా మందిరంలో ఈ నెల 10న నిర్వహించనున్న గురుపూజోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. వాకర్స్, వాకర్స్ క్లబ్ సభ్యులు, మానవ సేవే మాధవ సేవ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్, సభ్యులకు ఆలయ అర్చకుడు అయిలూరి రామశాస్త్రి ఆహ్వాన పత్రికలు అందించారు. గురుపూజోత్సం పర్వదినాన షిర్డీసాయికి 108 కలశాలతో నిర్వహించనున్న కలశారాధనలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఉచిత యోగా, భగవద్గీత తరగతులు ప్రారంభం



యోగా మాస్టర్ గణేష్‌కు వేంకటేశ్వరస్వామి చిత్రపటం బహూకరిస్తున్న సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో ఆదివారం ఉచిత యోగా, భగవద్గీత శ్లోకాల అధ్యయన తరగతులు ప్రారంభమయ్యాయి. యోగా మాస్టార్ గణేష్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయన తొలి ఏకాదశి రోజున తరగతులు ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. ప్రతి వ్యక్తి యోగా చేయాలని, యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అందరూ యోగాలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివారం ఉదయం 7 గంటలకు యోగా క్లాసులు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఉచిత శిక్షణ తరగతులను అందరూ వినియోగించుకోవాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కోరారు. మరిన్ని వివరాలకు 8297568913 నంబరులో సంప్రదించాలన్నారు.


బార్ అండ్ రెస్టారెంట్లకు సమయపాలన తప్పనిసరి

అల్లిపురం: బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బంది సమయపాలన పాటించాలని టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రం నాయుడు సూచించారు. ఆదివారం బార్ అండ్ రెస్టారెంట్, మద్యం దుకాణాల యాజమాన్యం, సిబ్బందితో ఆయన స్టేషన్ ఆవరణలో సమావేశమయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోమని, బార్ అండ్ రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాల పుటేజీ కూడా సేవ్ చెయ్యాలన్నారు, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సెటిల్‌మెంట్లు తదితర కార్యక్రమాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకే బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహించాలని, రాత్రి 11 గంటల తర్వాత మద్యం సరఫరా చేయకూడదన్నారు. మద్యం దుకాణం ముందు మద్యం సేవించరాదన్నారు. అలా చేసినట్లయితే యాజమాన్యంపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. బార్, మద్యం దుకాణల ముందు కొట్లాటలు జరిగినా, వివాదాలు చెలరేగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన మద్యం దుకాణాల యాజమాన్యాలకు సూచించారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



విశేష చందన అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: ఆషాఢ శుద్ధ ఏకాదశి, తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచే స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను నూతనంగా భక్తుల సహకారంతో తయారు చేసిన మండపంలో ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్త బృందాలు స్వామికి పండ్లు, పూలు, పిండి పదార్థాలు నివేదన చేసి విష్ణు సహస్ర నామాభిషేకాలు చేశారు. సాయంత్రం దేవస్థానం ఆవరణలో గల ధ్వజస్తంభం వద్ద మహిళలు ప్రత్యేకంగా దీపాలంకరణ చేసి పూజలు చేశారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

డాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం, శంకర్ ఫౌండేషన్, వి డెంటల్, వి హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన వాసవీ భవన్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఆరిశెట్టి శ్రీకాంత్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల సంఘాలు సేవా దృక్పథంతో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవసరమైన మేరకు చికిత్స అందించాలన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం శాశ్వత ప్రాతిపదిన కొంత మంది వైద్యుల సహాయంతో ఈ ప్రాంత ప్రజలకు నామమాత్రపు రుసుంతో వైద్యం అందించాలని, ఈ విషయంలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. స్థానికులకు కంటి, పంటి వైద్యానికి సంబంధించిన సమస్యలకు చికిత్స, అవసరమైన మందులు, కళ్లద్దాలు వంటివి అతి తక్కువ ధరకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాసరావు, కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ చంద్రశేఖర్, వి డెంటల్ ప్రతినిధి డాక్టర్ రమేష్, సంఘం కోశాధికారి దుర్గా నూకేశ్వరరావు, దుర్గా సోమేశ్వరరావు, కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, వాసవీ కల్యాణ మండపం సంఘం అధ్యక్షుడు విన్నకోట రామ్మూర్తి, బొడ్డు రఘు, పట్నాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత విశాఖే లక్ష్యం



యువకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: మత్తుపదార్థాల నియంత్రణకు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం యువతతో అవగాహన ర్యాలీ చేపట్టారు. పాతపోస్టాఫీస్ సమీపాన సెయింట్ అలోసిస్ గ్రౌండ్‌లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకాన్ని నివారించాలనే ఉద్దేశంతో పాటు, చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని సూచిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు. మత్తుపదార్థాల విక్రయాలు, వినియోగానికి సంబంధించి చట్టపరమైన శిక్షల గురించి తెలిపారు. అలాగే నేరాలు సంభవించే అవకాశం ఉన్నప్పుడు ముందస్తుగా పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. సమాచారం అందజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. విశాఖ మహానగరాన్ని నేర రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యువతతో ర్యాలీ నిర్వహించి, నేరాలు చేయబోమని, మత్తుపదార్థాల వాడకానికి దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీసులు, యువత పాల్గొన్నారు.

అన్నార్తులకు ఆహారం పంపిణీ



పేదలకు ఆహారం ప్యాకెట్లు అందజేస్తున్న గొల్లమాల అప్పారావు

కంచరపాలెం: దళిత సేన ఆధ్వర్యంలో ఆదివారం కంచరపాలెం ఫ్లైఓవర్ కింద, జ్ఞానాపురం రైల్వే స్టేషన్, దొండపర్తి, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల్లో సుమారు 450 మంది అన్నార్తులకు దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆహారం అందజేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ మీనా తదితరులు పాల్గొన్నారు.

హామీ మేరకు వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

డాబాగార్డెన్స్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, ఒకే కేడర్ ఉద్యోగులకు ఒకే వేతనం అమలు చేయాలని ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. సిటు కార్యాలయంలో ఆదివారం ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా చైర్మన్ సురేష్ నేతృత్వంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 22 వేల మంది నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగులు 198 కేడర్లలో గత దశాబ్దన్నర కాలంగా అత్యంత తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. వారికి సమాన పనికి సమాన వేతనం, సమాన సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ గౌరవ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్స్ రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మెడకు ఉరికొయ్యిలా తగిలించి, కార్మిక, కర్షక, విధానాలు తుంగలో తొక్కడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ శిరీష, శశిభూషణం, బ్రహ్మం, మోహన్, నాగరాజు, శ్రీనివాస్, పుష్పేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం



సంతాపం వ్యక్తం చేస్తున్న షియా ముస్లింలు

జగదాంబ: మొహరం సందర్భంగా వన్‌టౌన్‌లోని మజీద్ ఈ హుసేనీ మత పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరాక్ నగరంలో కరబాల మైదానంలో మహ్మద్ ప్రవక్త, వారి మనవడు అయిన హజరత్ ఇమామ్ హుసేనీతో పాటు 72 మంది అనుచరులను అన్న పానీయాలు లేకుండా నిర్బంధించి హత్య చేసిన అమానవీయ ఘటన నేపథ్యంలో ప్రతి ఏటా మొహరంను సంతాప సూచకంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ శోకతప్త సంఘటనకు గుర్తుగా షియా ముస్లింలు రెండు నెలల పాటు నల్లదుస్తులు ధరించి సంతాపం వ్యక్తం చేస్తారని తెలిపారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

జగదాంబ: బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సిబ్బంది నివాళులర్పించారు. ఆదివారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ రామచంద్రరావ్, బి.అశోక్ కుమార్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాంతంత్ర్య సమరయోధుడిగా, పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా అనేక కీలక శాఖల్లో ఆయన సేవలందించారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ షో



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రతి నెలా మొదటి ఆదివారం నిర్వహించే వినోదాల విందు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించిన కామెడీ షో ప్రేక్షకులను అలరించింది. క్లబ్ అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, పోర్టు శేషు, కుమారి, పుష్పమి, నాయుడు, రామానుజం, భానుప్రకాష్, సూర్యం, శివజ్యోతి, రాగస్ నాయుడు, నరసింహరావు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ఆహుతులను కడుపుబ్బా నవ్వించాయి. వీటిలో సర్దుకు పోదాం రండి, స్విమ్మింగ్ పూల్, జామచెట్టు, తాగుబోతు, కోడిపందాలు, డాక్టర్ పేషెంట్, డ్రైవర్ జాబ్, ప్రశాంతత, రెండు వేల నోటు స్కిట్స్ నవ్వుల్లో ముంచెత్తాయి. ముందుగా వాగ్దేవి నృత్యాలయం గురువు సౌందర్య సురేష్ శిష్య బృందం హరిప్రియ, జాహ్నవి, వైద్య, మౌనిక, గిరిష్మా చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో డ్రీం షెల్టర్స్ అధినేత రవిశంకర్, సన్‌మూర్తి, తిలక్ పట్నాయక్, బి.మాల్యాద్రి చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.